తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
16 అక్టోబర్ 2025









# 4 పార్కులకు విముక్తి

## రాజేంద్రనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

- ఆక్రమణదారుల నుంచి 19,878 గజాల భూమి స్వాధీనం
- రూ.139 కోట్ల విలువైన భూమిని రక్షించిన హైడ్రా
- జనచైతన్య లేఔట్‌లో ఆక్రమణలపై ఫిర్యాదులు
- ఫెన్సింగ్ నిర్మాణంతో భవిష్యత్ రక్షణ



**రాజేంద్రనగర్, అక్టోబర్ 15 (జనం సాక్షి) :**

హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ పరిధిలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఆక్రమణలను నిర్మూలించింది. బద్వేల్, ఉప్పరపల్లి గ్రామాల్లోని జనచైతన్య లేఔట్ ఫేజ్-1, 2లో కబ్జాకు గురైన నాలుగు పార్కులను ఆక్రమణల నుంచి విముక్తి చేసింది. మొత్తం 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు. ఈ భూమి విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు.దాదాపు 120 ఎకరాల్లో విస్తరించిన జనచైతన్య లేఔట్ ఫేజ్-1, 2లో హుడా అనుమతులతో ఏర్పాటు చేసిన పార్కులు ఆక్రమణకు గురవుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బుధవారం హైడ్రా సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. ఆక్రమణదారులు నిర్మించిన షెడ్‌లు, గదులను తొలగించి, భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భవిష్యత్ ఆక్రమణలను నివారించేందుకు ఫెన్సింగ్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఈ చర్యలు స్థానికంగా పచ్చదనం, ప్రజల వినోద స్థలాల రక్షణకు దోహదపడతాయని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ఆక్రమణల నిర్మూలనతో పార్కులు తిరిగి ప్రజా వినియోగానికి అందుబాటులోకి వస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.



# ప్రెస్ క్లబ్ నామినేషన్లు

## వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.రాజేష్


**హైదరాబాద్, అక్టోబర్ 15 :** రాజకీయం, సమస్యలపై మేధో అక్షర మధనం చేస్తూ ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్ట్ లకు మానసిక ప్రశాంతత, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని పొందేందుకు ఏర్పాటు చేసుకున్న ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు రానే వచ్చాయి. బుధవారం ఉదయం నుంచే ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఎంతో కోలాహలంగా జరిగింది. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేసిన సీనియర్ జర్నలిస్ట్ రాజేష్. ప్రస్తుతం ట్రెజరర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఈసారి ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నారు. క్లబ్ సభ్యులకు సేవలందించడంతో పాటు క్లబ్ అభివృద్ధిలో ఎ.రాజేష్ తనవంతు కృషి చేశారు. రాజేష్ కు మద్దతుగా అనేకమంది సీనియర్ జర్నలిస్టులు నామినేషన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు కె.విరహత్ అలి, ఆర్. రవికాంత్ రెడ్డి, డి. విజయకుమార్ రెడ్డి, వి.రమేష్, వైట్ల.రమేష్, శిగా శంకర్, హరిప్రసాద్, సి.వనజ, అబ్దుల్, ఈ.జనార్ధన్ రెడ్డి, ఎ. శ్రీకాంత్, ఎ.పద్మావతి, ఎం. రమాదేవి, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ నాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు సిపిఎం మద్దతు

## సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి

# ఆహార భద్రతకు ఆలోచన, ఆచరణ పునాది




ప్రపంచంలో అతిభయంకరమైనది, ప్రమాదకరమైనది ఆకలి. ఆకలి చావులు ఉండొద్దు, ఆకలితో ఎవ్వరూ పస్తులుండొద్దు, ఆకలితో బాధపడేవారికి అవగాహన కలిపించేలా చర్యలను ప్రోత్సహించడం కోసం ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ 1979లో అక్టోబర్ 16ని ప్రపంచ ఆహార దినోత్సవంగా ప్రకటించింది. ప్రపం చ జనాభా ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నందున, వ్యవసాయ ఉత్పత్తిని స్థిరంగా పెంచడానికి, ఆహార నష్టాలు మరియు వ్యర్థాలను తగ్గించే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ఆకలి, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారందరికీ పోషకమైన ఆహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసికోవడానికి కృషి చేయడానికి ప్రయత్నం చేస్తుంటాయి. ప్రతి ఏటా ఒక నిర్దిష్టమైన నినాదంతో ప్రణాళికలను సిద్ధం చేస్తూ ప్రజలలో అవగాహనా కలిపిస్తుంటారు. అందులో భాగంగా ఈ 2025వ సంవత్సరంకుగాను మెరుగైన ఆహారం మరియు మెరుగైన భవిష్యత్తు కోసం చేతులు కలిపి అనే నినాదంతో కోనసాగుతుంది, ఎవ్వరు ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని ప్రణాళికలు సిద్ధం చేసినా ప్రజలలో మార్పు రానంతవరకు నిరుపయోగమే అవుతాయి. ఒకవైపు ఆకలి చావులు, మరోవైపు ఆహారం వృధా చేస్తున్న వారిసంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. ఆకలి విలువ తెలియకపోవడం, ఆహారం విలువ తెలియకపోవడం, భవిష్యత్ పట్ల అవగాహనా లేకపోవడం వలన ఆహారాన్ని వృధా చేస్తున్నారు. నానాటికి భూమిలో సారం తగ్గుతుంది, ప్రకృతిలో అనేక పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఆహారకోరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఆహారం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పద్ధతులు, భవిష్యత్తులో సంభవించే పరిస్థితులను చిన్నారులకు విద్యాభ్యాసం లోనే ఒక భాగంగా చేర్చి బోధిస్తే ఆకలి, ఆహారం పట్ల పూర్తీ అవగాహనా వస్తుంది. జీవకోటి ప్రాణులకు శక్తీ అందించేది ఆహారమే. మరి ముఖ్యంగా మానవాళికి ఆహారం అందిస్తున్న ఈ ఆహార దినోత్సవం సందర్భంగా కష్టాలను, నష్టాలను ఓర్చుకొని రైతులు అంకితభావంతో పంటను పండించే రైతులకు కృతజ్ఞతలు చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆహారం మనిషి మనుగడకు జీవనాడి, అలాంటి ఆహారం పట్ల శ్రద్ధ వహించడం, ఆహారం కోసం నీరును ఆదాచేయడం, ప్రతిఒక్కరు చేయాల్సిన బాధ్యత. సురక్షితమైన, పోషకమైన, సాంస్కృతికంగా తగిన ఆహారాన్ని పొందాలంటే ఖచ్చితమైన ఆహార భద్రత అవసరమనే వాస్తవాన్ని గుర్తెరగాలి. ఆరోగ్యకరమైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనం, ఆరోగ్యకరమైన భవిష్యత్తు, ఆహారాన్ని ఇతరులతో పంచుకోండి, వారి ప్రాణాలను కాపాడండి. ఆహారం పట్ల ఆలోచన, ఆచరణ రేపటి ఆహార భద్రతకు పునాది.



**డాక్టర్. వై. సంజీవ కుమార్,**
ఫౌండర్, ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్,
**9393613555, 9493613555**

## అబ్దుల్ కలాం జీవితం నేటి తరం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది

• ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి



**బొంరాస్ పేట,అక్టోబర్ 15 (జనంసాక్షి):** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత నేటితరం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి అన్నారు.బుధవారం పాఠశాల ఆవరణంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద పుష్పాలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శాస్త్రవేత్తగా,రాష్ట్రపతిగా ఎన్నో స్థాయిలో ఉన్న ఉపాధ్యాయుడిగా పనిచేయడం తనకు ఇష్టమని పేర్కొన్న అబ్దుల్ కలాం ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సర్దార్, జ్యోతి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## ఎంజి విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్‌ను విడుదల చేసిన పీపీఎస్ మోటార్స్



**ఖైరతాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** దేశంలో అత్యధికంగా అమ్ముడైన ఈవీ యొక్క పరిమిత ఎడిషన్ అయిన విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్‌ను హైదరాబాద్‌లోని షోరూమ్‌లో ప్రారంభించినట్లు పీపీఎస్ మోటార్స్ ఎండీ రాజీవ్ సంఘ్వి బుధవా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీస ర్ వినయ్ రైనా, జెఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా జోనల్ హెడ్(సౌత్) సౌరవ్ ప్రకాష్, రెండు సంస్థల నుండి ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో పీపీఎస్ మోటార్స్ హైదరాబాద్‌లోని కస్టమర్‌కు మొదటి ఎంజి విండ్సర్ ఇన్‌స్పైర్ ఎడిషన్ వాహనాన్ని డెలివరీ చేసిందని తెలిపారు. ఎంజి విండ్సర్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భం గా 40 వేల యూనిట్ల మైలురాయిని దాటిన విం డ్సర్‌కు కస్టమర్ల నుండి లభించిన నమ్మకం నుండి ఇన్‌స్పైర్ ఎడిషన్ ఉద్భవించిందని తెలిపారు. కేవ లం 300 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేయబడు తున్న ఇన్‌స్పైర్ ఎడిషన్ విండ్సర్ భారతదేశ ఎల క్ట్రిక్ మొబిలిటీ ఉద్యమాన్ని నడిపిస్తున్న స్ఫూర్తికి చిహ్నం అన్నారు.

## గోయిబిబోతో రాపిడో వన్ - స్టాప్ ట్రావెల్ సొల్యూషన్ ప్రారంభం

**ఖైరతాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** గోయిబిబోతో కలసి రాపిడో వన్-స్టాప్ ట్రావెల్ సొ ల్యూషన్ ప్రారంభించినట్లు రాపిడో సహ వ్యవస్థాప కుడు అరవింద్ సంకా బుధవారం నగరంలో విడు దల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేక్‌మైట్రి ప్ గ్రూప్ సిఇఒ, సహ వ్యవస్థాపకుడు రాజేష్ మాగోవ్, కన్ఫర్మ్ టికెటి, ఇక్సిగో ట్రైన్స్ సిఇఒ దినేష్ కుమార్ కోథా లతో కలసి ఆయన మాట్లాడుతూ రోజువారీ ప్రయాణం నుండి వారాంతపు విహారం వరకూ, రాపిడో భారత దేశంలోని మొబిలిటీ రం గంలో అత్యంత సరసమైన, సౌకర్యవంతమైన వన్-స్టాప్ ట్రావెల్ యాప్‌గా నిలిచింద న్నారు. రాపి డో మొబిలిటీ స్పేస్, గోయిబిబోతో విమానాలు, హోటళ్ల బుకింగ్‌లను, రెడ్‌బస్‌తో ఇంటర్-సిటీ బస్ బుకింగ్‌లను, కంఫర్మ్ టికెట్‌తో రైలు బుకింగ్‌లను కలిపి, భారత దేశంలో మొట్ట మొదటి స్వదేశీ ట్రావెల్ సొల్యూషన్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ భాగస్వామ్యం లక్ష్యం మెట్రో నగరాలలో మాత్రమే కాకుండా మిగతా ప్రదేశాలు అంతటా మిలియన్ల మంది భారతీయులకు నిరవధిక, సౌకర్యవంతమై న, సుల 0భమైన ప్రయాణానుభవాన్ని అందిస్తుం దన్నారు.

## బకాయి ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి





**చేవెళ్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి):** బకాయి ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి గోటూరి చరణ్ గౌడ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ సభ్యుడు మాల చందు అధ్యక్షతనలో డివిజన్ సహాయ కార్యదర్శి గోటూరి చరణ్ గౌడ్ విద్యార్థులతో కలిసి చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో బకాయి ఉన్న స్కాలర్ షిప్, ఫీజ్ రియంబర్స్మెంట్ ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రెవెన్యూ ఉప అధికారి రాజశేఖర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చరణ్ గౌడ్ మాట్లాడుతూ...ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్ విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు బలవంతపు వసూళ్లు చేస్తున్నాయన్నారు. అయినా సర్కారు స్పందించడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న తీరు పేద విద్యార్థులందరికీ తీవ్రనష్టం కలిగిస్తుందని తెలిపారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాల నుంచి సర్టిఫికెట్లు పొందలేక పైచదువులకు వెళ్లలేక పోతున్నారని అన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు, యశ్వంత్, ఎస్ఎఫ్ఐ డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ఇర్ఫాన్, శ్రీశైలం, మనీ, విష్ణు, రిషి గౌడ్, వేణు, శివ, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ పోషణ మాసం

### మహిళలు ఆరోగ్యంగా ఉంటే బలమైన కుటుంబాలు ఏర్పడతాయి, తద్వారా బలమైన భారతదేశాన్ని నిర్మించుకోవచ్చు ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్ అక్టోబర్ 15 (జనంసాక్షి):** ఉప్పల్ విజయపురి కాలనీ మరియు రామంతాపూర్ వార్డ్ ఆఫీస్ లో సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు అన్నప్రాసన అక్షరాభ్యాసం నిర్వహించిన రజిత పరమేశ్వర్ రెడ్డి. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా శారీరకంగా, మానసికంగా బలహీనంగా ఉన్న పిల్లలను, గర్భిణీలను, బాలింతలను శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపరచి తద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పరచి బలమైన భారతదేశం రూపొందించబడాలనే ఉద్దేశ్యంతో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ,రాజీవ్ గాంధీ,వాజపేయి గారు నిర్దేశించారు.ఈరోజు కూడా మహిళలు ఆరోగ్యంగా ఉంటే బలమైన కుటుంబాలు ఏర్పడడం ద్వారా బలమైన భారత దేశాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది.అవగాహన లేకపోవడంతో గర్భిణీలు సరైన పోషక ఆహారం తీసుకోకపోవడం వలన వారి కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యంగా ఉండటం లేదు, తల్లి ఆరోగ్యంగా ఉండటం లేదు అనే ఉద్దేశ్యంతో వెయ్యి రోజుల పాటు ఈకార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా బిడ్డకు రెండేళ్ళ వయసు వరకూ సంరక్షించే విధంగా కార్యక్రమం రూపొందించబడింది అని ఆమె అన్నారు. పూర్వీకులు చెప్పిన విధానాలు వదిలిపెట్టి విదేటశీ సంస్కృతికి అలవాటు పడి జంక్ ఫుడ్స్ తినడం వలన కూడా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.అని గర్భిణీ స్త్రీల ఆలనా పాలనా, పోషక ఆహారం అందించే భాధ్యతను పురుషులు తీసుకోవాలి.గర్భిణీలకు, మహిళలకు ప్రధాన సమస్యగా ఉన్న రక్తహీనతను పోగొట్టుకోడానికి ప్రకృతి అందించిన అనేక పోషక ఆహార పదార్ధాలను తీసుకోవాలి తప్పించి మందులపై ఆధారపడటం శ్రేయస్కరం కాదు అని అన్నారు.శారీరక బలంతో బాటు మానసిక బలం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలి.రాష్టీయ పోషణ మాసం కార్యక్రమానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తుంది. అంగన్వాడీలు మూస విధానంలో కాకుండా గర్భిణీలకు, బాలింతలకు అవగాహన పెంచవలసి ఉంది.వారు తీసుకోవలసిన ఆహారం గురించి ప్రభుత్వం ఇచ్చిన మెనూ గురించి అవగాహన కల్పించాల్సిన భాధ్యత అంగన్వాడీలదే.సీమంతం కార్యక్రమం ద్వారా గర్భిణీలలో ఆనందం, ఉత్సాహం నింపాలి తద్వారా వారు ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలనే ఉద్దేశ్యంతో ఈ ఆలోచన చేయడం జరిగింది.జన్మనిచ్చిన తర్వాత తల్లి బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత శ్రేయస్కరం.తల్లిపాలు మంచి యాంటీబయోటిక్. బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే బిడ్డకు పాలు ఇవ్వడం ఉత్తమ మార్గం అని ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రామంతాపూర్ వార్డ్ ఆఫీస్ లో సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యం లో మరియు,ఉప్పల్ విజయపురి కాలనీలో స్టేట్ కోర్డినేటర్ మెర్విన్ సోహాని అల్వాల్ సి డి పి ఓ స్వాతి,సూపర్ వైజర్ వేంకట రమణ ,ఉప్పల్ పి హెచ్ సి మెడికల్ సూపర్ వైజర్ ప్రమీల ,కాలనీ వాసులు రమాదేవి, రాజేశ్వరి,తల్లులు,గర్భిణిలు,ఉప్పల్ సెక్టార్ అంగన్వాడీ టీచర్లు,కమ్యూనిటీ ఎడ్యుకేటర్ విజయ గారు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో బీసీ హక్కుల సాధన సమితి నిరసన




**రాజేంద్రనగర్,అక్టోబర్ 15 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నంబర్ 9ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శంషాబాద్ పట్టణంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య నాయకత్వం వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ బీసీలు రాష్ట్ర జనాభాలో 62 శాతం ఉన్నా, ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 18న ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. రామస్వామి, బి.జంగ య్య, ప్రభు లింగం, ఆర్.యాదగిరి నీలమ్మ, సత్తిరెడ్డి, మల్లేష్, సురేష్, సుధీర్, ఎ.ప్రభు, నరేందర్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి

**రాజేంద్రనగర్, అక్టోబర్15(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయమని మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. నవీన్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. జూబ్లీహిల్స్ పరిధిలోని షేక్‌పేట్, ఓయు కాలనీ ప్రాంతాల్లో నవీన్ యాదవ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు, డైరెక్టర్స్ ఏర్పుల కుమార్, లక్ష్మి శ్రీ, గంఘాదర్, హర్షవర్ధన్ రెడ్డి, గీత పాల్గొన్నారు.



### బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెడ్డి

## జేపీసీ నాయకులు మాధవ రెడ్డి వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలి

### గోగి కార్ శివకుమార్

**కాప్రా, అక్టోబర్ 15 (జనంసాక్షి):** బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెడ్డి జేపీసీ నాయకులు మాధవ రెడ్డి వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని బిసి నాయకుడు గోగి కార్ శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెడ్డిల స్థాయి సాకారులతో బీసీలు బతుకుతున్నారన్న చేసిన వ్యాఖ్యలను వెంటనే మీడియా ముఖంగా వాక్యాలను ఉపసంహరించుకోవాలి క్షమాపణ చెప్పాలి అన్నారు. బీసీలు ఎవరి పైన ఆధారపడి బతకరు అని బీసీలు అంటే ఉత్పత్తి కులాలు , మా శ్రమతో, మా సామర్థ్యంతో ఎదిగిన వర్గం. 'రెడ్డిల అండలేకుండా బతకగలరాని,బీసీ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం . ఇది సామాజికంగా విభజన కలిగించే, ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన మాట.తెలంగాణలో ప్రతి వర్గం ఈ రాష్ట్ర నిర్మాణంలో చెమటోడ్చింది. బీసీలు కేవలం ఓటర్లుగా కాదు, రైతులుగా, వ్యాపారులుగా, కార్మికులుగా, ఉద్యోగులుగా ప్రతి రంగంలో నిలబడ్డారు.మా శ్రమపై ఇతర వర్గాలు ఆధారపడతాయి కానీ మేము ఎవరిపైనా ఆధారపడం. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారు వెంటనే ప్రజలముందు క్షమాపణ చెప్పాలి.తెలంగాణ బీసీ సమాజం ఆత్మగౌరవం మీద ఎవరైనా దాడి చేస్తే మేము మౌనంగా ఉండం.మేము సవాలు విసురుతున్నాం బీసీ వర్గం లేకుండా ఏ రాజకీయ పార్టీ, ఏ ఆర్థిక వ్యవస్థ, ఏ సమాజం ముందుకు వెళ్లగలదో చూపిం చండి! మేము తెలంగాణ ఉద్యమంలో మెజార్టీ పాత్రలో ఉన్న బీసీలు మేమే తెలంగాణ వెన్నెముక, మేమే రాష్ట్రాభివృద్ధికి మూలస్తంభం బీసీ లేని అన్నారు.



మాధవరెడ్డి మరోసారి బీసీలపై అన్జిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని శివ కుమార్ఈ సందర్భంగా హెచ్చరించారు.

## తెలంగాణ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ స్మారక క్రీడా సమ్మేళనం

### క్రికెట్ టోర్నమెంట్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** తెలంగాణ ఎన్ఎస్‌యుఐ తరపున రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ నాయకుడు గొల్ల జాన్ ఆధ్వర్యంలో కుత్బుల్లా పూర్ నియోజకవర్గం ఐడీపీఎల్ కాలనీలో రాజీవ్ గాంధీ స్మారక క్రీడా సమ్మేళనం బహుమతి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూన రాఘవేంద్ర గౌడ్, మాజీ ఆంధ్రప్రదేశ్ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఎన్ఎస్ కేకే కళాశాల మొదటి బహుమతిని, విద్యా కళాశాల రెండవ బహుమతిని, ఎస్ ఆర్ జూని యర్ కళాశాల మూడవ బహుమతిని గెలుచుకున్నాయి. విజేతలకు రూ.5,000 నగదు బహుమతులు అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని పెంపొందించేందుకు, శారీరక, మానసిక దృఢత్వాన్ని అభివృద్ధి చేసేందుకు, ప్రతి సంవత్సరం ఇలాంటి క్రీడా సమ్మేళనాలను



నిర్వహిస్తున్నందుకు గొల్ల జాన్ ని ప్రముఖులు అభినందిం చారు.అనేక మంది ఉత్సాహభరితమైన విద్యార్థులు ఈ వేడుకలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ బిల్లా, యువజన కాంగ్రెస్ నాయకుడు శివ, ఎన్ఎస్‌యుఐ నాయకులు సాయి కిరణ్, హరీష్, సాద్విక్ పాల్గొన్నారు.

### మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**కొద్దబగల్ ,అక్టోబర్ 15 (జనంసాక్షి):** కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ స్కూల్ లో భారత మాజీ రాష్ట్రపతి, విజనరీ శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్ కలాం గారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కలాం చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ శ్రీ లక్ష్మీ వెంకటయ్య, ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సంతోష్ గారు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.కలాం గారి ఆశయాలను విద్యార్థుల్లో నాటేందుకు, వారి స్ఫూర్తిదాయక జీవితం గురించి ఉపాధ్యాయులు వివరణాత్మకంగా వివరించారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వందమంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మరియు ప్రశంస బ్యాచులు అందజేశారు.ఈ కార్యక్రమం విద్యార్థులలో స్ఫూర్తిని నింపడంతో పాటు, కలాం గారి స్వప్నాలను సాకారం చేయాలనే సంకల్పాన్ని కలిగించిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు

**శామీర్ పేట (జనంసాక్షి):** డోలు దరువు శివసత్తుల పూనకాలతో ఎంతో ఉత్సాహంగా శ్రీ రేణుక ఎల్లమ్మతల్లికి బోనాలను అంగరంగ వైభోగంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి 8వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి భోనాలను చేశారు. గ్రామం నుంచి శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి, మాతమ్మలకు రెండు బోనా లను గౌడ కులస్తులతో పాటు గ్రామంలోని భక్తులు బోనాలను తీసుక వెల్లి సమర్పించారు. అమ్మ వారికి ఒడిబియ్యం పోసి మొక్కులను తీర్చు కున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా

### మాజీ సర్పంచ్ రాజు నాయక్



**యాచారం, అక్టోబర్ 15 (జనంసాక్షి):** పుట్టెడు దుఃఖసాగరంలో ఉన్న ఓ కుటుంబానికి నందివనపర్తి మాజీ సర్పంచ్ రాజు నాయక్ అండగా నిలిచి ఆదుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తోడుగా ఉన్నానంటూ డాక్టర్ వర్త్యా వత్ రాజు నాయక్ వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంబోతు తండాకు చెందిన ఆపదలో ఉన్న కుటుంబానికి తోడుగా ఉన్నానంటూ రాజు నాయక్ తన అనుచరుల ద్వారా రూ. పదివేల ఆర్థిక సహాయం పంపారు. పంపిన నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో ఆపదలో నున్న కుటుంబాలకు రాజు నాయక్ మరింత అండదండగా ఉండాలని భవిష్యత్తులో మరింత మందికి చేయూతనిచ్చేలా రాజు నాయక్ ను భగవంతుడు ఆశీర్వదించాలని వారంతా కోరారు. అనేకమంది పేదల కన్నీళ్లను తుడిచే శక్తి, అధికారం ఆయనకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఆంబోతు తండాకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

### పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు

**చేవెళ్ల, అక్టోబర్ 15 (జనంసాక్షి):** చేవెళ్ల మండలం ఆలూరు, పల్గుట్ట, దామరగిద్ద గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్య అధికారులు మాట్లాడుతూ...పశువులకు సకాలంలో టీకాలు వేయించుకొని వ్యాధులు నుంచి రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## సైబర్ బాధితులకు ఊరట

- 10.70 లక్షలు రిఫండ్ అందజేత



**మల్కాజిగిరి,అక్టోబర్ 15 (జనంసాక్షి):** సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నేరేడ్ మెట్ సిఐ సందీప్ కుమార్ పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు నేరేడ్‌మెట్ పోలీసులు భారీ ఊరట కల్పించారు. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ మోసాలకు గురైన 40 మంది బాధితులకు, కోర్టు ద్వారా ప్రాసెస్ చేయించి 10 లక్షల 70 వేల రూపాయల రిఫండ్ ఆర్డర్లను బుధవారం బాధితులకు అందజేశారు.ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌లో అనుమానితులు పంపే లింక్ లను ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనుకోని పరిస్థితులలో ఎవరైనా లింక్‌లు ఓపెన్ చేసి సైబర్ నేరానికి గురైతే, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా పోయిన సొమ్మును రికవరీ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. బాధితులకు సొమ్ము రిఫండ్ చేయడంలో విశేష కృషి చేసిన సైబర్ వెర్టికల్ హెడ్ కానిస్టేబుల్ కాంతయ్య, ఉమెన్ కానిస్టేబుల్ స్వప్న రెడ్డి లను ఉన్నతాధికారులు అభినందించారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ లో చేరిన కాంగ్రెస్ నాయకుల

### మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**దోమ అక్టోబర్ 15 (జనంసాక్షి):** దోమ మండలం గూడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ బషీర్, కుమారులతో కలిసి, బీ ఆర్ ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన, స్థానిక ఎమ్మెల్యే పనితనం మీద అసహనం వ్యక్తం చేస్తూ,బీ ఆర్ ఎస్ ప్రభుత్వంతోనే రైతులు, ప్రజలు బాగుపడతారు. అని భావిస్తూ, పార్టీలో చేరీన గూడూరు గ్రామ మైనారిటీ సోదరులు. ఈ కార్యక్రమం లో దోమ మాజీ జడ్పీటీసీ నాగి రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, దోమ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజి రెడ్డి , రఘు మోహన్ రెడ్డి ,ప్రవీణ్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

### యువత అబ్దుల్ కలాం ఆదర్శాలను అనుసరించాలి

### రామకృష్ణ రెడ్డి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** మణికొండ మున్సిపాలిటీ ఆర్కే సర్కిల్ లో మాజీ భారత రాష్ట్రపతి, భారత రత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కలాం దేశ సేవకు జీవితమంతా అంకితం చేశారు. యువత ఆయన ఆదర్శాలను అనుసరించాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్, శ్రవణ్ కుమార్, గంగాధర్, దేవేందర్, నాగిరెడ్డి, మధు, శేషు, వేణు పాల్గొన్నారు.



## మజీద్ పూర్లో ఘనంగా ఎన్ఎస్ఎస్ ముగింపు సభ



**శామీర్ పేట్ (జనంసాక్షి):** ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు సభ ఘనంగా నిర్వహించారు.మజీద్‌పూర్ గ్రామంలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల శామీర్ పేట్ లో నిర్వహించిన 7 రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయ వంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా 7వ రోజు ముగింపు సభ ఘనంగా నిర్వహించబడినందుకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు దశరథ్ ,శశివర్ధన్ రెడ్డి విచ్చేసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలను అభినందించారు.వారు యువత సమాజ సేవలో భాగస్వాములుగా ఉండాలని ప్రేరే పించారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె. అనిత , పీడీ హైమావతి ,ఎన్ఎస్ఎస్ సభ్యురాలు ధనవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శిబిరంలో చురుకుగా పాల్గొన్న ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు మరియు షీల్డ్‌లు అందజేశారు.ఏడు రోజులపాటు వాలంటీర్లు గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, మొక్కల నాటడం, ఆరోగ్య శిబిరం, బాలికా దినోత్సవ కార్యక్రమాలు మరియు ఇంటింటికీ సర్వే వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.శిబిరం విజయవంతంగా ముగియడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

## అబ్దుల్ కలాం ఆశయాలు నెరవేర్చాలి :అఫ్జల్ ఖాన్



**శామీర్ పేట్ (జనంసాక్షి):** సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ శామీర్ పేట్ లో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు..అబ్దుల్ కలాం గారి ఆశయా లను ఆచరణలో పెట్టి యువత జీవితం కొన సాగించాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని కోరారు. అబ్దుల్ కలామ్ కలలను సాకారం చేయడానికి అందరు తమ వంతు కృషి చేయాలని, తద్వారా ఒక బలోపేతమైన భారత నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మీడియా తో మాట్లాడుతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, చంద్ర గౌడ్, మహ్మద్ షబ్బీర్, మణి, భూపాల్, ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**మహేశ్వరం,అక్టోబర్ 15 (జనంసాక్షి):** మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.మహేశ్వరం గ్రామానికి చెందిన గాజుల చంద్రయ్య, గోల్కొండ కళమ్మ,గడగూటి శివశంకర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఈ విషయం మాజీమంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణగంటి ఆనందం, కర్రోళ్ల రాజేష్, మునగపాటి నవీన్, దుద్దు కృష్ణ యాదవ్,సయ్యద్ ఆదిల్ అలీ, కాడమోని ప్రభాంకర్, కాకి కుమార్, పెయ్యాల భూషణ్, కటికల పరమేష్, జోరల రమేష్, కటికల శ్రీను,జెల్ల రాఘవేందర్, కర్రోళ్ల కార్తిక్, మిద్దింటి యాదగిరి,మహేందర్, కటికల శంకర్, గణేష్,స్వామి తదితరులు పాల్గొన్నారు.



# నిజమైన పేదల పెన్నిధి పిఏసి చైర్మన్ అరికెపూడి

### బలరాం యాదవ్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** సేవే పరమావధిగా భావిస్తూ శేర్లింగంపల్లి ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ నికార్సైన పేదల మనిషి అని సీనియర్ నాయకులు బలరాం యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు అరికెపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు బహిరంగ జన్మదిన శుభాకాంక్షలు అని తెలియజేయడంతో పాటు కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలలోకి రాకన్నా మునుపే అనేక సేవా కార్యక్రమాల ద్వారా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి ప్రజా సంక్షేమం కోసం కృషిచేసిన మంచి మనిషి అరికెపూడి అని కొనియాడారు. సేవా తత్పరతే ప్రధాన లక్ష్యంగా రాజకీయాలలో అంచలంచలుగా ఎదుగుతూ ఎమ్మెల్యేగా, రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ గా ఎదిగి రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఎన్ని అడ్డంకులు ఎదురుగా ఉన్నా నిరంతరం నియోజకవర్గంలోని పేదలను కలుసుకొని వారికోసం ఏదైనా మంచి చేయాలనే తపనతో ముందుకు సాగుతూ రాజకీయం అంటే సేవారంగం అని నిర్వచించడానికి ప్రయత్నిస్తున్నారని బలరాం యాదవ్ కీర్తించారు. శేరిలింగంపల్లిలో పలు సేవా



కార్యక్రమాల ద్వారా ప్రస్థానాన్ని ప్రారంభించి శేరిలింగంపల్లి ప్రజలతో విడదీయరాని అభినవ సంబంధాన్ని ముడి వేసుకున్న అరికెపూడి శేరిలింగంపల్లి ప్రజల హృదయంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. ఆ అభిమానంతోనే అరికపూడిని శేరిలింగంపల్లి ప్రజలు అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటున్నారని, మరిన్ని పుట్టినరోజులను జరుపుకోవడం ద్వారా శేరిలింగంపల్లి ప్రజలకు అద్భుతమైన భవిష్యత్తును అందించాలని బలరాం యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ యాదవ్, అవదీష్ నారాయణ, సన్నీ యాదవ్, నాగరాజు, రేపల్లె అశోక్, నరసింహ, ప్రేమ్ సాయి, సంజు తదితరులు పాల్గొన్నారు.

## ట్యూషన్ కు వెళ్తున్నామని చెప్పి ఇద్దరు బాలుర అదృశ్యం



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** ఇంట్లోనుండి బయలుదేరి ట్యూషన్ కి వెళ్తున్నామని చెప్పి ఇద్దరు స్నేహితులు అదృశ్యమైన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. కాగా బుధవారం మాదాపూర్ పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... మాదాపూర్ గ్రీన్ ఫీల్డ్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న మేడిశెట్టి శ్యామ్ సూర్యా వెంకటేష్(14) మంగళవారం సాయంత్రం పాఠశాల నుండి ఇంటికి తిరిగి వచ్చి సాయంత్రం 5 గంటల సమయంలో ట్యూషన్ కి వెళ్తున్నానని చెప్పి స్కూల్ బ్యాగ్ తీసుకొని అందులో కొన్ని జతల దుస్తులను సైతం తీసుకొని వెళ్లడం జరిగింది. అయితే ట్యూషన్ సమయం గడిచినప్పటికీ శ్యామ్ సూర్య ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన అతని తండ్రి అతని మిత్రుడైన రామేశ్వ రం సాయి స్వదీప్ ఇంటికి ఫోన్ చేసి వాకబు చేయగా అతను కూడా ఇదే పరిస్థితిలో ఇంటి నుండి వెళ్లిపోయినట్లు సమాచారం అందింది. దీంతో వారి తల్లిదండ్రులు బుధవారం మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్యామ్ సూర్య తెలుపు రంగులో ఉండి 5.8 అంగుళాల ఎత్తు కలిగి ఉన్నాడని, రామేశ్వరం సాయి స్వదీప్ సైతం తెలుపు రంగుతో 5.2 అంగుళాల ఎత్తు ఉన్నాడని, ఇద్దరు కలిసి తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలను మాట్లాడగలుగుతారని ఎవరికైనా అనుమా నాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాల్సిందిగా మాదాపూర్ పోలీసులు తెలియజేస్తున్నారు.

## ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్ కు సిపిఎం మద్దతు

### సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి

**హయత్‌నగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** హయత్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయం లో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ ) ఈ నెల 18 న బీసీ సంఘాలు, జేఏసీ రాష్ట్ర బంద్ కు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు కీసర నర్సిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము 42 శాతం రిజర్వేషన్ బిల్లుని ఆమోదించి, కేంద్రం లోని బిజెపి ప్రభుత్వానికి పంపితే గవర్నర్ ను అడ్డుపెట్టుకొని ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి మాటల్లో తేనెలు వలికించి చేతల్లో విషం కక్కుతుందని దానికి ఉదాహరణగా బీసీ బిల్లే అని వారు గుర్తు చేశారు. బీసీల పట్ల ఎక్కడలేని ప్రేమ వలకపోసే బిజెపి నేడు బీసీ రిజర్వేషన్లను ఎందుకు ఆమోదించటం లేదని గవర్నర్ బిల్లును ఎందుకు తొక్కిపెట్టారని వారు ప్రశ్నించారు? తక్షణమే కేంద్ర సర్కారు తన గవర్నర్ బిల్లును ఆమోదించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది.




## అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



**కాప్రా, అక్టోబర్ 15 (జనంసాక్షి) :** చర్లపల్లి డివిజన్ లోని అభివృద్ధి పనులపై బుధవారం రెడ్డి కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఇంజినీరింగ్ శాఖ అధికారులతో జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ డివిజన్లోని బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్స్ మరియు కనెక్టింగ్ వాల్స్ వంటి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఈ బాలకృష్ణ, ఏ ఈ అభిషేక్, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు నష్టపరిహారం



**మహేశ్వరం,అక్టోబర్ 15 (జనంసాక్షి):** టీజీఐసీసీకి భూములు ఇచ్చిన భూ నిర్వాసితులతో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు.బుధవారం కందుకూరు మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో తిమ్మాయిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...కందుకూరు మండ లం తిమ్మాయిపల్లి గ్రామ రైతులకు ఎకరాకు 55 లక్షల నష్టపరి హారం ప్రభుత్వం అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో టీజీఐసీసీ జోనల్ మేనేజర్ శ్రావణ్ కుమార్,తహశీల్దార్ గోపాల్,పలు శాఖల అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లీపిల్లల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం : అంగన్వాడీ సూపర్ వైజర్ రేణుక

**శామీర్ పేట్ (జనంసాక్షి):** తుర్కపల్లి మున్సిపల్ కార్యలయంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషక ఆహారాన్ని తీసుకోని పండంటి బిడ్డలను జన్మనివ్వాలని అంగన్వాడీ సూపర్ వైజర్ రేణుక అన్నారు.ప్రజల ఆరోగ్యనికి సరైన ఆహరం సమతుల్య పోషకాహారం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా పిల్లలు గర్భణి స్త్రీలు, తల్లులు సక్రమమైన పోషణ పొందితేనే కుటుంబం ఆరోగ్యంగా ఉండగలదని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పోషక ఆహారంపై అవగాహన పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించ వచ్చని వివరించారు. సామూహిక శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి ఎం డాక్టర్ సృజన, అంగన్వాడీ టీచర్లు రాధ, లక్ష్మి, లావణ్య, జయ, సుజాత, అనిత, కృష్ణవేణి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



## నాణ్యత ప్రమాణాలు పాటించని రాఘవేంద్ర హోటల్

### టిఫిన్ తిందామని వెళ్లిన కస్టమర్ కు చేదు అనుభవం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్15 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చౌరస్తాలోని రాఘవేంద్ర హోటల్ లో దోశలో ఈగలు వచ్చాయి. ఇబ్రహీంపట్నం మొలుగు శ్రీనివాస్ బుధవారం రాఘవేంద్ర హోటల్ లో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తినడానికి సెట్ దోశ ఆర్డర్ ఇవ్వగా పనిచేసే వ్యక్తి దోష తీసుకువచ్చి టేబుల్ పై పెట్టగా ఆకలితో ఉన్న శ్రీనివాస్ దోష తినడం ప్రారంభించగానే దోష కురుమలో చనిపోయిన ఈగ కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నించగా ఈగ వస్తే ఏం చేయమంటారని, కావాలంటే కురుమ తెచ్చిస్తా తినండి అని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో తీవ్ర ఆందోళనకు గురైన శ్రీనివాస్ మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాడు. శ్రీనివాస్ అప్పటికే ఈగ ఉన్న కుర్మను శ్రీనివాస్ తినడం జరిగింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ రాఘవేంద్ర హోటల్ పై ఫుడ్ సేఫ్టీ అధికారులతో సంప్రదించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాఘవేంద్ర హోటల్ లో ఇదివరకు కూడా ఈగలు, బొద్దింకలు వచ్చిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇలా వరుసగా ఈగలు బొద్దింకలు రావడంతో స్థానిక ప్రజలు ఈ హోటల్ ను చీట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## కరీంపూర్ గ్రామ ప్రజలకు మాజీ సర్పంచ్ వరాలు

### హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు



**కోట్ పల్లి అక్టోబర్ 15(జనంసాక్షి):** కోట్ పల్లి మండలం కరీంపూర్ గ్రామ ప్రజలకు బీఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ సర్పంచ్ సుందరి అనిల్ తరఫున పలు ఉచిత పథకాలు ప్రకటించారు. ఈ పథకాలు రాజకీయాలతో సంబంధం లేకుండా, అన్ని మతాలకు, అన్ని వర్గాలకు సమానంగా అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. కరీంపూర్ గ్రామంలో నివసిస్తున్న ప్రతి ఆడపిల్ల వివాహానికి రూ. 1,05,116 ఆర్థిక సహాయం, ప్రతి అబ్బాయి వివాహానికి రూ. 55,116 ఆర్థిక సహాయం అందించ బడుతుందన్నారు. అలాగే గ్రామ ప్రజలకు పెళ్లిళ్లు, ఎంగేజ్‌మెంట్‌లు, పుట్టినరోజులు వంటి శుభకార్యాల కోసం ఫంక్షన్ హాల్ ఉచితంగా ఇవ్వబడుతుందని గ్రామంలో ఎవరు మరణించినా, వారి కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ. 11,000 ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. అనారోగ్య కారణంగా ఆపరేషన్ అవసరమయ్యే వారికి రూ. 15,000 వరకు సహాయం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా గ్రామస్థులందరికీ ఇఫ్తార్ విందు, మొహరంల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని సొంత ఇల్లు నిర్మాణంలో స్లాబ్ వేసే సమయంలో రూ. 21,000 ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. ఈ పథకాలు కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా, గ్రామంలోని ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటాయని సుందరి అనిల్ తెలిపారు. ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం కి ఘన నివాళులర్పించిన

### కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** దేశభక్తి, విజ్ఞానం, మరియు వినమ్రతకు ప్రతీక అయిన భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీజేపీ రంగా రెడ్డి జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసినా కార్యక్రమం లో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పాల్గొని, వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ మాట్లాడుతూ డాక్టర్ కలాం కేవలం శాస్త్రవేత్త మాత్రమే కాదు, ఆయన దూరదృష్టి కలిగిన నాయకుడు. స్వప్నాలు కనండి, వాటిని సాధించడానికి కృషి చేయండి అని ఆయన చెప్పిన మాటలు ఈరోజు కూడా ప్రతి భారత యువకుడి హృదయంలో మార్మోగుతున్నాయి అని అన్నారు. ఆయన చూపిన మార్గం మనందరికీ శాశ్వత ప్రేరణ అని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్ర యాదవ్, చైతన్యపురి కార్పొరేటార్ రంగా నర్సింహా గుప్తా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి సర్వేలు కీలకం

### జాతీయ విజ్ఞాన సాంకేతిక సర్వే వర్క్‌షాప్‌లో డాక్టర్ అరవింద్ కుమార్




**హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** సమగ్ర శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి సర్వేలు కీలకమని ఎన్ఎస్‌టీఎంఐఎస్, విజ్ఞాన సాంకేతిక శాఖ సలహాదారులు, హెడ్ డాక్టర్ అరవింద్ కుమార్ తెలిపారు. భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన సాంకేతిక సర్వే 2024-25 పై బంజారా హిల్స్ లోని హయత్ ప్లేస్ లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఈ ప్రత్యేక వర్క్‌షాప్‌కు పరిశ్రమ, పరిశోధనా సంస్థల నుంచి విశేషమైన స్పందన లభించడం ఈ రెండు రంగాల మధ్య పెరుగుతున్న సహకారానికి నిదర్శనమన్నారు. విజ్ఞాన సాంకేతిక శాఖ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ అభివృద్ధికి మార్గదర్శకంగా, విధాన పరమైన ప్రధాన సంస్థగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశంలోని విజ్ఞాన సాంకేతిక సామర్థ్యాన్ని అంచనా వేయడం, డేటాను సమర్థవంతమైన విధాన నిర్ణయాలకు వినియోగించడం దాని ప్రధాన లక్ష్యాలన్నారు. ఈ లక్ష్యాలు సాధించేందుకు జాతీయ ఇన్నోవేషన్ సర్వే, జాతీయ విజ్ఞాన, సాంకేతిక సర్వే వంటి పలు జాతీయ స్థాయి సర్వేలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ జాతీయ సర్వే ఒక సమగ్ర పరిశీలన కార్యక్రమం అన్నారు. ఇందులో జరుగుతున్న పరిశోధనల స్వభావం, పెట్టుబడుల స్థాయి, శాస్త్రవేత్తల భాగస్వామ్యం వంటి అంశాలను కవర్ చేస్తుందన్నారు. ఇది ప్రభుత్వ, ప్రైవేటు ఆర్‌డీ సంస్థలు, విద్యా, పరిశోధనా సంస్థల నుంచి సేకరించిన డేటాను సమగ్రంగా విశ్లేషించి, దేశంలోని విజ్ఞాన రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు, వనరుల కేటాయింపుకు దారి తీస్తుందన్నారు. ఈ సర్వే ఫలితాలు 21 కీలక సూచికలపై వివరణాత్మక నివేదికల రూపంలో రూపొందించబడతాయని తెలిపారు. ఈ సమాచారాన్ని యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థలతో కూడా పంచుకుంటారన్నారు. తద్వారా భారతదేశం శాస్త్ర, సాంకేతిక స్థాయిని ప్రపంచ ప్రమాణాలతో సరిపోల్చుకోవచ్చన్నారు. గమనించాల్సిన విషయమేమిటంటే, దేశంలో ఆర్ డీ (పరిశోధన, అభివృద్ధి) పెట్టుబడులు 2011-12 నుంచి 2021-22 మధ్య కాలంలో దాదాపు రెండింతలు పెరిగాయన్నారు. ఇది దేశం ఈ రంగంలో సాధించిన గణనీయమైన పురోగతిని సూచిస్తుందన్నారు. భారతదేశంలో సుమారు 40 శాతం ఆర్‌డీ పెట్టుబడులు పరిశ్రమల నుంచి, 60 శాతం ప్రభుత్వం నుంచి వస్తున్నాయన్నారు. కానీ అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ నిష్పత్తి విరుద్ధంగా ఉందన్నారు. అక్కడ 70 శాతం పైగా ఆర్‌డీ నిధులు పరిశ్రమల ద్వారా సమకూరుతున్నాయని చెప్పారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించడం భారతదేశానికి ఒక ప్రధాన జాతీయ లక్ష్యంగా ఉందన్నారు. ఈ దిశగా భారత ప్రభుత్వం పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పలు జాతీయ మిషన్ మోడ్ కార్యక్రమాలు ప్రారంభించిందన్నారు. వాటిలో నేషనల్ క్వాంటమ్ మిషన్, సెమీకండక్టర్ మిషన్, నేషనల్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మిషన్ ముఖ్యమైనవన్నారు. విధాన పరంగా కూడా ప్రభుత్వం అంతరిక్షం, జియో-స్పేషియల్ టెక్నాలజీ వంటి రంగాలను సంస్కరణాత్మక విధానాలతో లిబరలైజ్ చేసిందన్నారు. అదనంగా.. ఉన్నత ప్రమాణాల పరిశోధన, ఇన్నోవేషన్‌కు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రత్యేక నిధి పథకాలు కూడా అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ పరిశోధన వ్యవస్థలో జాతీయ విజ్ఞాన, సాంకేతిక సర్వే కీలకమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సర్వేలో చురుకైన భాగస్వామ్యం చాలా ముఖ్యమన్నారు. ఎందుకంటే, మనం రూపొందించే విధానాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూ దేశ శాస్త్రీయ, పారిశ్రామిక సామర్థ్యానికి ప్రాతినిధ్యం వహించాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ రాధాకిశోర్ పాండ్రంగి, ఎన్ఎస్‌టీఎంఐఎస్, విజ్ఞాన సాంకేతిక శాఖ సైంటిస్ట్ డాక్టర్ రబీంద్ర కుమార్ పాణిగ్రాహి మాట్లాడారు.

## డాల్బీ అట్మోస్ మ్యూజిక్

### సంగీతం, ఇన్-కార్ ఎంటర్‌టెయిన్‌మెంట్ భవిష్యత్తుకు శక్తి




**హైదరాబాద్ (జనంసాక్షి):** డాల్బీ అట్మోస్ మ్యూజిక్ అనేది స్టీరియో పరిమితులకు అతీతమైన విప్లవాత్మక ఆడియో అనుభవం. ఇది కళాకారులు వ్యక్తిగత శబ్దాలను 3డి స్పేస్‌లో ఉంచేందుకు అనుమతిస్తుంది. సంగీతాన్ని మరింత విశాలంగా, పొరలుగా, భావోద్వేగపంరంగా ఆకర్షణీయంగా అనిపించేలా చేస్తుంది. మీరు స్మార్ట్‌ఫోన్, హెడ్‌ఫోన్‌లు, సౌండ్‌బార్ లేదా మీ కారులో వింటున్నా, డాల్బీ అట్మోస్ కళాకారుడు ఉద్దేశించిన విధంగానే మిమ్మల్ని ధ్వనితో చుట్టుముడుతుంది. ఇది గానా వంటి ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉంది. అలాగే, విస్తృత శ్రేణి డాల్బీ-ఎనేబుల్డ్ పరికరాల్లో చక్కగా ప్లే అవుతుంది. ఇప్పుడు హైదరాబాద్‌లో: ఆదిత్య మ్యూజిక్, మహీంద్రాలో ఒక ప్రదర్శన ఈ ఆవిష్కరణకు ప్రాణం పోసేందుకు, ఆదిత్య మ్యూజిక్ మరియు మహీంద్రా సహకారంతో డాల్బీ అక్టోబర్ 15న హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక ప్రదర్శనను నిర్వహించింది. స్టూడియో నుంచి కారు వరకు డాల్బీ అట్మోస్ మ్యూజిక్ సృష్టించే, అనుభవించే, ఆస్వాదించే విధానాన్ని ఎలా మారుస్తుందో ఈ కార్యక్రమం హైలైట్ చేసింది. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి చిత్రం నుంచి "జంబర్ గింబర్ లాలా" ప్రదర్శించారు. ఈ పాటను ఆర్.ఆర్.ధ్రువన్ స్వరపరచి, డాల్బీ అట్మాస్‌లో మిక్స్ చేశారు. ఆదిత్య మ్యూజిక్ డైరెక్టర్ ఆదిత్య గుప్తా మాట్లాడుతూ, "ఆదిత్య మ్యూజిక్‌లో, మేము ఎల్లప్పుడూ అందరికన్నా ముందంజలో ఉంటూ, నాణ్యమైన సంగీతాన్ని అందించడం ద్వారా మా శ్రోతలకు ఉత్తమ అనుభవాలను అందిస్తూ వారి విశ్వాసాన్ని చూరగొంటున్నాము. మేము ఎల్లప్పుడూ సంగీతంలో కొత్త ప్రపంచ సాంకేతికతను స్వీకరిస్తూ, ముందుకు కొనసాగుతున్నాము. డాల్బీ అట్మోస్ మన సంగీతాన్ని ఎలా వినాలో తిరిగి ఊహించుకోవడానికి అనుమతిస్తుంది, దీనివల్ల ప్రతి బీట్, ప్రతి స్వరం ఇప్పుడు అభిమానులతో మరింత లోతుగా కనెక్ట్ అయ్యే విధంగా సజీవంగా వస్తుంది" అని వివరించారు.

## సమాజ సేవే ధ్యేయంగా

- మానవ విలువలకు ప్రాధాన్యంగా
- మన్సూరాబాద్ అభివృద్ధి
- కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**హయత్ నగర్, అక్టోబర్ 15 (జనంసాక్షి):** ఆటోనగర్, మన్సూరాబాద్ హిందూ స్మశాన వాటికలో అసంపూర్తిగా కొనసాగిన అభివృద్ధి పనులను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి జిహెచ్ఎంసి నిధులతో రూపాయలు 50.50 లక్షల వ్యయంతో చేపట్టిన అవసరమైన అనేక సౌకర్యాలు సిద్ధం చేయబడ్డాయని ఈ పనులను పరిసర కాలనీ వాసుల సమక్షం లో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. టికాపరులు ప్రజల పై ఆర్థిక భారాన్ని తగ్గించేలా ఎక్కువ లో ఎక్కువ రూపాయలు18,000/- నుండి 20,000/- మాత్రమే తీసుకోవాలని కఠినంగా వారికి సూచనలు చేశారు. స్మశానం లో ఏర్పాటు చేసిన స్విచ్ బోర్డులు, ఎలక్ట్రికల్ వైరింగ్, ప్లంబింగ్ సామగ్రి దొంగతనం అవుతున్నాయన్న విషయాన్ని గుర్తించి, దీనికి పరిష్కారంగా స్థానిక కాలనీ వాసులతో కమిటీ ఏర్పాటుచేసి పర్యవేక్షణ ఉండాలని వారు ఆదేశించారు. ఈ స్మశాన వాటిక హిందూ మతానికి చెందిన అన్ని కులాల వారు ఉపయోగించుకునేలా అందుబాటులో ఉందని వారు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిసర కాలనీల సంక్షేమ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.